క్లుప్తంగా

వైభవం.. వైకుంఠపురం వేంకటేశ్వరుని కల్యాణం



అమరావతి: దక్షిణాది వైకుంఠంగా పిలువబడే అమరావతిలోని వైకుంఠపురంలో వేంచేసి యున్న పద్మావతి అలమేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం, విశేష అలంకరణ గావించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి గరుడోత్సవం గ్రామ వీధుల్లో వైభవంగా నిర్వహించారు.

125 మందికి ఉచితంగా కంటి పరీక్షలు



దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలోని శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్లో గురువారం గ్రామానికి చెందిన సయ్యద్ మీరావలి ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, ధూళిపాళ్ల సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 125 మందికి కంటి పరీక్షలు చేశారు. విజన్ సెంటర్ కో-ఆర్డినేటర్ మల్లేష్, ఫీల్డ్ స్టాఫ్ రత్నకుమార్, సునీత రోగులను పరీక్షించారు. కంటి శుక్లాలు ఉన్నవారు 35, కళ్లజోళ్లు కావాల్సిన వారు 45, కంటి సంబంధిత సమస్యలున్నవారు 40 మంది ఉన్నట్లు గుర్తించారు. కంటి శుక్లాలకు ఉచితంగా ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్స్‌పల్ పానెం శ్రీనివాసరెడ్డి, సోముమస్తాన్‌రెడ్డి, కైపురామకృష్ణరెడ్డి, సయ్యద్ రహీం, మర్రి శ్రీనివాసరెడ్డి, విజ్ఞాన్ స్కూల్ మస్తాన్‌వలి, మాజీ సర్పంచ్ సయ్యద్ అల్లాబక్షు పాల్గొన్నారు.

ఆహార ప్యాకెట్ల పంపిణీ

సత్తెనపల్లి: భరత మాత అన్నప్రసాద వితరణ పథకంలో భాగంగా పట్టణంలోని గీతామందిరంలో సత్తెనపల్లి హెడ్‌పోస్ట్‌మాస్టర్ జానపాటి రామకృష్ణ కుమార్, జ్యోత్స్న మీనాక్షి దంపతుల ఆర్థిక సాయంతో 40 మంది పేదలకు ఆహార ప్యాకెట్లను కుమార్తెలు శ్రీతనయ, శ్రీధాత్రి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివ్వెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

శ్రీరామ నవమి వేడుకలకు తెలుగు లోగిళ్లు పెట్టింది పేరు. తాటాకులతో చలువ పందిళ్లు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో ఆదర్శ దంపతులు పీటలపై కూర్చుని కోదండరాముడి కల్యాణాన్ని దగ్గరుండి జరిపించారు. సీతారాముల ఆలయంలో బెల్లం, పానకం, వడపప్పు నైవేద్యంగా భక్తులకు సమర్పించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని ప్రతి గ్రామంలోని రామాలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

- ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారాముల కల్యాణం
- తిలకించి, తరించిపోయిన భక్త జనం
- భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో గల శ్రీ కోదండరామాలయం, వడ్డవల్లి ఆంజనేయస్వామి దేవాలయం, వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, రఘురాం నగర్‌లోని రామాలయం, వాల్మీకి నగర్ లోని రామాలయం, నాగార్జున నగర్ లోని ఆంజనేయస్వామి దేవాలయం, గుంటూరు రోడ్ లోని వాసవి నగర్ లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం, అబ్బూరురోడ్ లోని కోదండ రామాలయం, మహారాష్ట్ర వీధిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో, కట్టమూరు, నందిగామ, కొమెరపూడి, ధూళిపాళ్ల, రెంటపాళ్ల, పాకాల పాడు, అబ్బూరు, ఫణిదం, బృగుబండ, పెదమక్కెన, కంటేపూడి, గుజ్జర్లపూడి, తదితర అన్ని గ్రామాలలో గురువారం శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వ హించారు. కట్టావారి పాలెంలో ఎడ్లబండి పై స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వ హించారు.

అంగరంగ వైభవంగా..

అమరావతి: దక్షిణ కాశీ క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన అమరావతి కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణంగా అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారికి తొలుత ఎదుర్కోల ఉత్సవం నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి పరాశరం రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వైఖానస ఆగమానుసారం కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని, స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. 20 మంది దంపతులు పీటలపై కుర్చుని కల్యాణాన్ని తిలకించారు. అమరావతిలోని పల్లపు వీధి, మిట్టమీద రామాలయం, అగ్రహారం, ధరణికోట తూర్పు, పడమర వీధి, దిడుగు, మల్లాది, జూపూడి, మునగోడు, అత్తలూరు, పెదమద్దూరు, ఉంగుటూరు గ్రామాలలో శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.



అమరావతి కోదండరామాలయంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే నంబూరు

ఆకట్టుకున్న పల్నాడు ఆచారవంతులు సేవ

పెదకూరపాడు: పెదకూరపాడు ఎస్సీ కాలనీలోని ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. పల్నాడు ఆచారవంతులు అంకమ్మతల్లి దేవాలయం నుంచి రామాలయం వరకు సేవ చేశారు. అనంతరం ప్రభను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచారవంతుల సేవను తిలకించారు. అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. 75 త్యాళ్ళూరు, లగడపాడు, రామాపురం, కంభంపాడు, గారపాడు, పరస, కాశిపాడు, తమ్మవరం, పాటిబండ్ల, లింగంగుంట్ల గ్రామాల రామాలయాల్లో స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్ఐలు కృష్ణారావు, సత్యనారాయణ బందోబస్త్ నిర్వహించారు.

కమనీయం..

అచ్చంపేట: స్థానిక శ్రీ సీతారాముల వారి దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ వైభవంగా జరిగింది. రాజీవ్‌నగర్‌లో వడ్డెర యూత్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అచ్చంపేట అభయాంజనేయస్వామి విగ్రహానికి ఆకు పూజ జరిపించారు. చిగురుపాడు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. కోగంటివారి పాలెం, కోనూరు, పెదపాలెం, వేల్పూరు, మాదిపాడు, చింతపల్లి తదితర దేవాలయాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

ఘనంగా సీతారాముల కల్యాణం

నకరికల్లు: స్థానిక చౌత్రా సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చల్లా శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు. బాచిమంచి రాజశేఖర్ పూజాధికాలు నిర్వహించగా కొడవటిగంటి పాండురంగాచార్యులు నిత్యానివేదనలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జూలకంటి లింగమూర్తి, జూలకంటి సురేష్, తాళ్లూరి మురళి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చందోలు ప్రకాశరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ నవమి..

క్రోసూరు: క్రోసూరు, అనంతవరం, దొడ్లేరు, ఆవులవారి పాలెం, పెరికపాడు, హసనా బాద్, నాగవరం, గుడిపాడు, గరికపాడు, 88త్యాళ్లూరు, ఉయ్యందన, పీసపాడు, అందుకూరు, బయ్యవరం, ఊటుకూరు, విప్పర్ల గ్రామాల్లోని రామాలయాల్లో శీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. క్రోసూరు వేణుగోపాలస్వామి దేవస్థానం నుంచి శీతారాముల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. సహృదయ సేవ సంస్థ, విప్పర్ల నీలంపాటి లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబాబు ఆధ్వర్యంలో శోభ యాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవస్థానం నుంచి శివారు చెరువుకట్ట వద్ద నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయస్వామి దేవస్థానం వరకు ర్యాలీ నిర్వహించారు.

అత్యంత వైభవంగా...

రాజుపాలెం: రాజుపాలెం జయంతి కాలనీలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శ్రీ వైష్ణవ హరిదాసులు సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్ర స్వామివారికి విద్యుద్దీపాల అలంకరణలో గ్రామోత్సవం నిర్వహించారు. గణపవరం, బలిజేపల్లి, అనుపాలెం, ఇనిమెట్ల, కోటనెమలిపురి, పెదనెమలిపురి తదితర గ్రామాల్లో స్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది.

సీతారాముల కల్యాణం

ముప్పాళ్ళ: మాదల గ్రామంలోని ఎస్సీ కాలనీలో పురాతన రామాలయంలో స్థానికులు స్వామి వారికి కల్యాణం జరిపించారు. ముప్పాళ్ళలోని రామాలయంలో కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

సీతారాముల కల్యాణం.. కమనీయం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం, నాగిరెడ్డిపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, గంగిరెడ్డిపాలెం, చంద్రాజుపాలెం, వెంకటాయపాలెం గ్రామాల్లో సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బెల్లంకొండ కోదండరామాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మాచాయపాలెం ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చంద్రాజుపాలెం గ్రామంలో శీతారాముల కల్యాణ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి



పెదకూరపాడు ఎస్సీ కాలనీలో సేవ చేస్తున్న పల్నాడు ఆచారవంతులు




75త్యాళ్లూరులో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



నందిగామలో సీతారామస్వామి..



మహారాష్ట్ర వీధిలో సీతారాముల విగ్రహాలను తీసుకెళ్తున్న భక్తులు



నకరికల్లులో శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో..



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి



పట్టణంలో పానకం పంపిణీ చేస్తున్న చల్లంచర్ల సాంబశివరావు తదితరులు



నందిగామలో అన్నసంతర్పణ..

ఏసు ప్రభు చూపిన మార్గంలో నడుద్దాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పారుపల్లి(క్రోసూరు): ఏసు ప్రభు చూపిన శాంతి, దయ, ప్రేమ మార్గాల్లో నడిస్తే అందరూ ఆనందంగా ఉంటారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని పారుపల్లి గ్రామంలో రక్షణ సువార్త పండుగల(మతబోధనల కార్యక్రమాల)కు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు బాల స్వామి, జర్సన్ అబ్రహం, సిల్వన్, సుధీర్, కపాపాల్ పాల్గొని ప్రత్యేక ప్రార్దనలు నిర్వహించారు. పీసపాడు సర్పంచ్ రాజు, పారుపల్లి ముత్తయ్య, ఎంపీపీ పి.కోటయ్య, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి , ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, విప్పల రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్షణ సువార్త సభలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

సత్తెనపల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన గోరంట్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మద్దిగుంట్ల రామారావు వ్యవసాయ పనుల నిమిత్తం రూ.1.50 లక్షలతో జత ఎడ్లను 20 రోజుల క్రితం కొనుగోలు చేశాడు. పొలంలో మేతకు వెళ్లి తిరిగి వస్తుండగా గారపాడు రోడ్డులోని పొలంలో రెండున్నర అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆకుల మేసేందుకు వెళ్లిన ఎద్దు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఎద్దు వెళుతుండగా యజమాని దానిని పక్కకు అదిలించాడు. ప్రమాదకరంగా ఎత్తు తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలను మార్చక పోవడంతో ఎద్దు మృతి చెందిందని, ఇది విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యవల్లే జరిగిందని రైతు రామారావు ఆందోళన వ్యక్తం చేశాడు.



మృతి చెందిన ఎద్దు వద్ద రైతులు

చైతన్య గోదావరి బ్యాంకు 247వ శాఖ ప్రారంభం

నరసరావుపేట: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సత్తెనపల్లిరోడ్డు బరంపేట మూడు బావుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన 247వ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నరసరావుపేట రూరల్ బ్రాంచ్‌ను గురువారం ఆ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ బ్యాంక్ శాఖ సేవలను నరసరావుపేట పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులు, బడుగు, బలహీన వర్గాలకు చేయూతనిస్తూ గ్రామీణ బ్యాంకుల్లో ప్రప్రథమంగా నిలుస్తోందని పేర్కొన్నారు. విద్య, తనఖా, భూమి కొనుగోలు వంటి అన్నిరకాల రుణాలు, అన్ని సదుపాయాలను కల్పిస్తుందన్నారు. తమ బ్యాంకు ప్రస్తుతం నాలుగు ప్రాంతీయ కార్యాలయాలు, 247 శాఖల ద్వారా పనిచేస్తూ రూ.8,070 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించి, రూ.9,600 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేసిందని తెలిపారు. రూ.200 కోట్లకు పైగా లాభాన్ని ఆర్జించిందన్నారు. ఇసప్పాలెం మహంకాళీ అమ్మవారి దేవస్థానం ఎండోమెంట్ అధికారి టి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులోనే అన్నీ బ్యాంకుల కన్నా డిపాజిట్లపై అత్యధిక వడ్డీ వస్తుందని పేర్కొన్నారు. నరసరావుపేట ప్రాంతీయ మేనేజర్ పి.మారుతీరామ్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రజలందరూ తమ సేవలను వినియోగించుకుని, తాము అభివృద్ధి చెందుతూ, బ్యాంకు అభివృద్ధికి చేయూత అందించాలని కోరారు. తమ బ్యాంకులోనే గ్రాము బంగారానికి అత్యధికంగా రూ.4,150 చొప్పున రుణం అతి తక్కువ వ్యవధిలోనే ఇస్తున్నామని పేర్కొన్నారు. అక్షర నర్సింగ్ హోం డాక్టర్ సబ్రంరామ్‌ప్రసాద్, న్యాయవాది నంద్యాల సత్యనారాయణరెడ్డి, ఇంజినీర్ కె.కమలాకరరెడ్డి, బ్యాంకు హెడ్ ఆఫీస్ ముఖ్యఅధికారి ఓ.ఆంజనేయులు, ఆడిటర్ మురళీకృష్ణ, శాఖాధికారి సాయి సునీల్, క్యాషియర్ ఓ.మహేష్, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యకుమార్, రామబ్రహ్మం, సత్యనారాయణ, అరవింద్, ఆమని, కోటేశ్వరరావు, సాంబశివనాయక్, యమలయ్య తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ కామేశ్వరరావు, అధికారులు

మాదలలో పశు వైద్యశిబిరం

మాదల(ముప్పాళ్ళ): మాదల గ్రామంలో కుక్కల దాడిలో గాయపడిన గొర్రెలకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్య సేవలందించారు. ఈ దాడిలో 30 గొర్రెలు మృతి చెందగా, మరో ఆరు గొర్రెలు గాయాల పాలైన సంగతి తెలిసిందే. గాయపడిన గొర్రెలకు యాంటీ రేబీస్ టీకాను అందించినట్లు మాదల పశు వైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి తెలిపారు. అవసరమైన వాటికి ఇతర చికిత్సలు అందించటం జరిగిందన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి హరీష్‌కు సన్మానం

నకరికల్లు: నర్సింగపాడు గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో తెలంగాణ హైకోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన నకరికల్లుకు చెందిన కొమ్మవరపు వెంకటసాయి హరీష్‌బాబు గురువారం కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో సత్కరించారు. హరీష్ మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారం, కాశీవిశ్వేశ్వరస్వామి కృపతో తాను లక్ష్యాన్ని చేరుకున్నానని తెలిపారు. కార్యక్రమంలో కొమ్మవరపు శివ ప్రసాద్, సువర్చలాదేవి, వెంకటసాయి మోహనకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నేడు వైఎస్సార్ 'ఆసరా' నగదు చెక్కుల పంపిణీ

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడవ విడుత చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని.. 941 డ్వాక్రా సంఘాలకు రూ.6.44కోట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సాయంత్రం 5 గంటల నుంచి అచ్చంపేట సచివాలయం 1, 2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్లో జరుగుతుందని చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అజెండాలోని 35 అంశాలపై చర్చించి, ఆమోదించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫిషియోగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరుకానున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, అధికారులు, హాజరుకావాలని పేర్కొన్నారు.

కల్లంలో మిర్చి మాయం

పోలీసులను ఆశ్రయించిన బాధిత రైతు



యడ్లపాడు: రాసిపోసిన మిర్చిలో కొంత భాగంగా మాయమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం .. యడ్లపాడు గ్రామానికి చెందిన మిర్చి రైతు కల్లూరి శ్రీనివాసరావు సుమారు 15 క్వింటాళ్ల మిర్చిని పొలంలో రాసిగా పోసి పరదా కప్పి ఉంచాడు. యడ్లపాడు పీహెచ్‌సీ వెనుక 16వ నంబర్ హైవే సర్వీసు రోడ్డుకు చేరుకునే ఈ డొంక మార్గంలో ఖాళీ ప్రదేశంలో ఉంచి గోతాల్లోకి తొక్కించేందుకు మిర్చిని ఉంచాడు. వీటి పక్కనే మరికొన్ని టిక్కీలను పెట్టాడు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అక్కడికెళ్లి చూడగా పరదా చినిగి, వాటి పక్కనే మిర్చి చెల్లాచెదురుగా కనిపించింది. టిక్కీల్లో రెండు తగ్గడంతో అంతా పరిశీలించి చూశాడు. గుర్తుతెలియని దుండగులు అపహరణ చేసినట్టు గుర్తించి యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.